# మిథ్యా బింబాలు

పి.ఎస్.నారాయణ



# మిథ్యాబింబాలు

పి. ఎస్. నారాయణ

## నవల

# మిథ్యాబింబాలు

## (నవల)

ఆంధ్రప్రభ

సచిత్ర వారపత్రికలో

**22-09-1965 నుండి**

**26-01-1966 వరకు**

ధారావాహికంగా

ప్రచురింపబడింది.

**వెల:రు. 140**

# మిథ్యాబింబాలు

తెలుగు దేశంలో కృష్ణానదీ తీరాన ఐదు వందల గడపతో ఒక జమిందారీ గ్రామం వున్నది. దాని పేరు మాధవాపురం. ప్రస్తుతం జమీ అయితే లేదుగాని, దాని అవశేషాలు అన్నట్లుగా పడిపోయిన మట్టికోట, విశాల ప్రాంగణం, జోడు గుర్రాల టాంగా కనబడుతూనే ఉంటాయి. ఆ జమీ పూర్వపు శోభను గుర్తుకు తెస్తున్నట్లుగా ఇప్పటికీ ఆ ఆఫీసుముందు కంచుగంట గంటగంటకూ మ్రోగుతునే ఉంటుంది. ముసలి మేనేజర్ తన పాత డెస్కు ముందు కూర్చొని వెండి ఫ్రేము కళ్ళజోడు వెనుకనుండి చూస్తూ ఎప్పుడూ పుస్తకాలు తిరగేస్తూనే వుంటాడు.

ఆ రోజు సాయంత్రం ఆ ఊరంతా కళకళ లాడుతూంది. పెద్ద వీధి అనిపించే ఆ వీధినిండా రంగు కాగితాల తోరణాలు కట్టారు. 'ప్రియబంధు' ముందు పెద్ద పందిరి వేశారు. అక్కడకు పదిమైళ్ళ దూరంనుండి తెప్పించిన స్పీకర్ సెట్‌లోనుండి సినిమా పాటలు వినబడుతున్నాయి.

'ప్రియబంధు' జనంతో హడావుడిగా వున్నది. అంతమందిలోనూ ఇద్దరు యువకులు ఎక్కడంటే అక్కడ ప్రత్యక్ష మవుతూ తిరుగుతున్నారు. వారిలో ఒకరు ప్రియబంధు స్వంతదారుడు, మధుమూర్తి. రెండొవ అతను అతడి మిత్రుడు సారథి.

ఈ రోజున ఆ గ్రామంలో స్థాపిస్తున్న ఆసుపత్రికి ప్రారంభోత్సవం జరుగుతున్నది. ఇక వాళ్ళ జోలికి మృత్యువే రాదన్నంత ఆనందంగా వున్నది, అక్కడి ప్రజలకు. అది వాళ్ళకు పర్వదినం!

ఇన్నాళ్ళూ లేని ఆసుపత్రి ఈనాడు రావటానికి కారణం– నెల రోజుల క్రితం జరిగిన ఒక విచిత్ర సంఘటన!

దక్షిణంవైపు పట్నంనుండి రోజూ సాయంత్రం మూడు గంటలకు వచ్చే రైలుబండి, ఆ రోజు సూర్యుడు పడమటి కొండలకు ఎర్రటి రంగు పులుముతున్న సమయంలో వచ్చి, మాధవాపురం స్టేషన్లో అర నిముషం ఆగి తిరిగి కదిలి వెళ్ళిపోయింది. ఆ అరనిముషంలోనే స్ఫురద్రూపి అయిన ఒక యువకుడు తన పెట్టెబెడ్డింగ్‌తో దిగి నిశ్శబ్దానికి నిలయంగా వున్న ఆ స్టేషన్‌ను అన్ని వైపులా పరిశీలిస్తూ ఉండిపోయాడు.

'మధుమూర్తి ఎక్కడ?'

అతడి ఆశ్చర్యానికి అంతు లేకపోయింది. తను రెండు వందల మైళ్ళ దూరంలో ఉన్నప్పుడే, తనను ఎప్పుడు చూద్దామా, ఎప్పుడు ఆప్యాయంగా కౌగిలించుకుందామా అని ఎదురు చూచిన మధుమూర్తి ఈ రోజు తన ఊరి స్టేషన్‌లో మూడు రోజులు ముందుగా తెలియబరిచి దిగినప్పుడు గూడా అమితానందంతో స్వాగత పురస్కరంగా ఎదుర్కోలేదేమా అని విభ్రాంతి జెందాడు.

తన రాకకోసం అహర్నిశలూ ఎదురు చూచే మధుమూర్తి ఎందుకు రాలేదు?

మనస్సు పరిపరి ఆలోచనలతో వికలత్వం చెందింది.

తను వ్రాసిన ఉత్తరం అందలేదా? అందకుండా ఎందుకుంటుంది? మరయితే ఎందుకు రాలేదు? ఒంట్లో సుస్తీగాని చేయలేదు గదా? లేక మరే అర్జంటు పనిమీదయినా మరో ఊరు వెళ్ళాడేమో? తన పిచ్చిగాని తను స్వయంగా రావడానికి వీల్లేని ఇబ్బందులేమైనా కలిగితే కనీసం మరో మనిషినైనా పంపివుండేవాడు!

మరేమిటి?

సారథికి కాస్త చికాకు వేసింది. పెట్టె బెడ్డింగ్ అక్కడే పెట్టి స్టేషన్ మాస్టర్ గదిలోకి వెళ్ళాడు.

"ఇక్కడకు మాధవాపురం ఎన్ని మైళ్ళుంటుందో చెప్పగలరా?"

ఏదో వ్రాసుకుంటున్న ఆయన తలెత్తి, "జమిందారుగారి బంధువులా మీరు?" అన్నాడు.

"కాదు!"

"అయితే మీరు గట్టి చిక్కులో పడ్డట్టే! జమిందారుగారి టాంగావచ్చే ఆశకూడా లేదన్నమాట! బండి ఆలస్యంగా వస్తే వెంకన్న ఎద్దుబండి గూడా ఉండదు. మీ బంధువులకు మీరు ముందుగా వస్తున్నట్లుగా తెలియబరచ లేదా?"

"అన్నీ అయినాయి. అయినా మధుమూర్తి ఎందుకు రాలేదో ఎంతగా ఆలోచించినా అర్థం కావటంలేదు!"

"మధుమూర్తి గారంటే 'ప్రియబంధు' యజమానులు గదూ?"

"అవునవును!" అన్నాడు ఉత్సాహంగా.

"చాలా మంచివారు. యువకుడయినా చాలా పెద్దమనిషి తరహాగా వ్యవహరిస్తుంటారు. నాలుగయిదు రోజుల కొకసారి సాయంత్రం పూట షికారుగా ఇటు వైపుకు వస్తుంటారు గూడా!"

అసలు విషయాన్ని వదిలి ఏదేదో మాట్లాడుతున్న ఆయన ధోరణి విసుగనిపించి, "ఇంతకీ మాధవాపురం ఎంత దూరమో చెప్పారుగాదు!" అన్నాడు.

"ఎంత లేకేం... రెండున్నర మైళ్ళయినా ఉంటుంది. కాళ్ళకు పని కలిగిస్తే ముప్పావు గంటలో చేరుకుంటారు!"

ఒక్క క్షణం మౌనంగా ఊరుకొని, "అయితే మీరొక్క సహాయం చేయాలి! నా పెట్టె బెడ్డింగ్ ఇక్కడ ఉంచుతాను. రేపుదయాన్నే వాటి కోసం ఎవరినైనా మనిషిని

పంపుతాను!” అన్నాడు.

“అలాగే చేయండి!” అన్నాడు ఆయన లేచి నిలబడుతూ.

సారథి పెట్టెలోని బ్యాటరీలైటు తీసుకొని, పెట్టె బెడ్డింగ్ స్టేషన్ మాస్టరు గదిలో మూలగా పెట్టాడు.

“ఎటుగా వెళ్ళాలో ఒక్కసారి చెబితే...”

“ఇలా తూర్పువైపుగా కొంత దూరం డొంక వెంట వెళ్ళారంటే కాలువ తగులుతుంది. ఆ ఒడ్డునే వెళ్ళండి... మాధవాపురం!”

“థాంక్స్! వస్తానండి!”

సారథి ఒక్కసారి నిశ్శబ్దంగా వున్న ఆ స్టేషన్ నలువైపులా చూచి బయటకు వచ్చాడు.

పక్కగా వున్న రెండు మూడు రైల్వే క్వార్టర్సు స్టేషన్‌కు అంగరక్షకుల్లా ఉన్నాయి. చుట్టూ పొలాలు కృష్ణ నీటిని త్రాగుతూ వింత శోభతో గాలి కనుగుణంగా ఊగుతున్నాయి. ఇంతదాకా ఎర్రగా మిడిసిపడుతున్న పడమటివైపు ఆకాశం వయస్సు వచ్చిన వాడి ముఖంలా నల్లబడుతూంది. పొలాల మధ్య మట్టి డొంక బాట ప్రకృతి కన్యకు పాపిటిలా వున్నది.

సారథి వడివడిగా అడుగులు వేస్తున్నాడు.

బాగా పొద్దెక్కకముందే మాధవాపురం చేరుకోవాలి. నరసంచారంలేని తెలియని ఈ ఒంటరి బాటలో పొద్దుబోయి పోవటమూ కష్టమే. అయినా బండి ఈ రోజునే లేటుగా రావాలీ!

తన రాకకు అత్యాసక్తిని చూపే తన ప్రియమిత్రుడు మధుమూర్తి ఎందుకు రాలేదు? ఈ రోజున అతి ప్రశాంతంగా ఈ మారు మూల గ్రామంలో జీవితం గడుపుతున్న అతడికి అతి సన్నిహితుడైన తనకు స్వాగతం చెప్పటంకన్నా మించిన పని

ఏం కలిగి వుంటుంది?

మధుమూర్తి రూపం కన్నులముందు సాక్షాత్కరించింది. పట్నంలో ఎమ్.బి.బి.యస్ లో చేరాడు తను. అంతవరకూ ఆ నగరం ముఖమైనా చూడని తనకు కాస్త భయం వేసింది. అటువంటి సమయంలోనే మధుమూర్తితో పరిచయమైంది. తనతో సరిగ్గా ఒక్క సంవత్సరం గడిపాడు. ఒకేగదిలో ఉండేవాళ్ళు. చాలా గంభీరంగా ఉండేవాడు. తూచి తూచి మాట్లాడేవాడు.

అనుకోకుండా మధుమూర్తి జీవితంలో ఒక హఠాత్సంఘటన జరిగింది. మొదటి సంవత్సరం శెలవలకు మాధవాపురం వెళ్ళిన మధుమూర్తి తిరిగి చదువు మిషతో పట్నం రాలేదు. ఎవరి పట్టువల్లనైతే ఆ చదువు చదువుతున్నాడో ఆ తండ్రే మరణించినప్పుడు ఇక ఆ చదువు కొనసాగించవలసిన అవసరం ఏమున్నది?

తను ఎంతో చెప్పి చూచాడు. లాభం లేకపోయింది. "సారథీ! జీవితంలో ఇష్టంలేని పని చేయటంకన్నా మరొక ప్రాణంతకం లేదంటాను! నాకు తెలుసు, నేను దానిలో పైకిరాలేనని. ఇన్నాళ్ళూ ఆయన పట్టుచూచి ఆయన మనస్సు కష్టపెట్టటం ఇష్టం లేక ఆయన తృప్తికోసం చదివాను! అందునా నేను ధనార్జనకోసం చదవవలసిన అవసరం లేదు. ఇప్పుడు ఉన్న ఆస్తినే నిలబెట్టుకోవటం ఎలాగా అని మధన పడుతున్నాను. అక్కడే వుండి వాటిని చూసుకుంటూ ఆ దారిలోనన్నా సుగమంగా నడవగలిగితే నా జీవితానికిక లోటేమీ లేదు!" అన్నాడు నవ్వుతూ ఆ రోజున.

అతడి అదృష్టమే అన్నట్లుగా అతడి భార్య శాంతి కూడా, అతడికి అన్ని విధాలా శాంతిని చేకూర్చింది. అతడి జీవితానికి మరింత వెలుగు బాటను చేకూర్చింది. అదే అతడి ప్రతి ఉత్తరం లోనూ ప్రతిబింబిస్తుండేది. "ఎవరూ లేని నాకు అందరూ ఉన్నట్లుగానే చేయగలుగుతుంది నా శాంతి! శాంతిని పొందటం నా పూర్యపుణ్య ఫలం!"

బాటకు అడ్డుపడుతూ కాలువ వచ్చింది. కాలువ గట్టెక్కాడు. ఎడమ చేతివైపుగా దీపాలు మిణుకు మిణుకు మంటూ సర్వితోపుల్లోనుండి ఒక గ్రామం కనబడింది.

‘అదే కాబోలు మాధవాపురం’ అనుకొని అటువైపు అడుగులు వేయసాగాడు సారథి. కాలువలో నీరు నిండుగా ఉండి గలగల లాడుతూ పారుతోంది. పక్కనున్న రెల్లు పొదలు ఆ గాలికి వింత ధ్వనులను ప్రసారం చేస్తున్నాయి. మీది మీదికి వచ్చే చల్లని గాలికి పరవశత్వం చెందాడు సారథి.

ఎంతో ఆశతో వచ్చిన తనకు మధుమూర్తి స్టేషన్‌కు రాకపోవటం నిరాశ కలిగించింది.

వెళ్ళగానే మధుమూర్తిని నిలబెట్టి ప్రశ్నించాలి– ‘ప్రాణాధికంగా ప్రేమించే తను వస్తున్నా స్టేషన్‌కు ఎందుకు రాలేదూ?’ అని. ఇంత దూరాన వున్న స్టేషన్‌కు బండి తీసుకురావాల్సింది పోయి అసలు మనిషే పత్తాలేడు!

తను ఇటు కృష్ణానది దాటి ఎప్పుడూ రాలేదు. నాలుగు రోజులు సెలవులిచ్చారని తెలిస్తే చాలు తన ప్రాణం తీసేవాడు. ఉత్తరాలమీద ఉత్తరాలు కురిపించేవాడు. “ఎందుకు, సారిథీ, నన్ను ప్రేమిస్తున్నానంటావ్! నన్ను మించిన మిత్రుడు నీకు లేడంటావ్! కాని నా మాటకు ఎందుకు విలువ ఇవ్వవ్? మాధవాపురం వచ్చి నాలుగు రోజుల పాటు నాతో గడిపి నాకు ఎందుకు ఆనందాన్ని చేకూర్చలేవు? ఈ సెలవల్లో నువ్వుగాని రాకపోయావో ఇక నేను ఎన్నడూ నీ దగ్గరకు రాను!”

ఎప్పటికప్పుడు తను వెళ్దామనే అనుకుంటాడు. అన్ని వందల మైళ్ళ దూరం వెళ్ళి నాలుగు రోజుల్లోనే ఎలా తిరిగి రాగలడు? వెళితే కనీసం ఒక నెలయినా ఉండాలి. మధుమూర్తితో సాయంసమయాల్లో సర్వితోపుల్లో తిరగాలి. నదిలో రెల్లుపొదలను తప్పుకుంటూ గంటల తరబడి ఈత గొట్టాలి. పడవలులాగే పల్లెవాళ్ళ గీతాలు వింటూ తనను తాను మరిచిపోయి లీనమవ్వాలి. ఇన్ని కోరికలు నాలుగు రోజులలో ఎలా తీర్చుకోగలడు? పోనీయ్, అన్నాళ్ళు ఉందామా అంటే చదువుతున్నది ఎమ్.బి.బి.యస్. ఎంతో కష్టపడి చదివితే తప్ప కృతార్థుడవ్వటం కష్టం. ఒకవేళ ఏదో విధంగా సర్ది చెప్పుకొని వెళ్దామా అంటే మరొక అడ్డంకి. అందుకనే ఎప్పటికప్పుడు దాటేస్తున్నాడు. సంవత్సరం క్రితం మధుమూర్తి శాంతికి పట్నం చూపే మిషతో

వచ్చాడు. వాళ్ళ ఉన్న మూడు రోజులూ తన గదిలోనే.

వెళ్ళేటప్పుడు శాంతి కూడా ఆహ్వానించింది– 'తప్పకుండా రండి' అంటూ. అప్పుడు మధుమూర్తి నవ్వుతూ అన్నాడు: 'వాడు ఎట్లాగూ నీ మాట వినడు... లాభం లేదు. నా మాట వినే చెల్లెల్నయినా తీసుకు వచ్చి వాడికి అంటగట్టాలి. ఆమెన్నా ముక్కుకు తాడేసి లాక్కొచ్చి మాధవాపురంలో పడేస్తుంది!'

తను నవ్వి ఊరుకున్నాడు.

తన రాకకోసం అంత ఆసక్తి చూపిన మధుమూర్తి ఈ రోజున తన నెందుకింత నిర్లక్ష్యంచేశాడు? దానికి జవాబు మాధవాపురంలో శాంతికి నిలయమైన ప్రియబంధులో నివసిస్తున్న మధుమూర్తి దగ్గరే వున్నది. ఇంకా కొన్ని క్షణాల వరకూ తనకు అర్థం కాని ప్రశ్నే అది!

బహుశః ఉత్తరం అందలేదేమో?

ఏమో మరి? అందలేదేమో?

మాధవాపురం దాపులో కొచ్చేటప్పటికి చీకటి నల్లటి దుప్పటిలా ప్రకృతిని కప్పేసింది. యోజనాల దూరంలోని నక్షత్రాలు చీకటిని చీల్చలేని వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాయి. గాలి శీతల ధ్వనులతో మందంగా పయనిస్తోంది.

మాధవాపురం వైపు ఉన్న వంతెన దాటి మట్టిబాటలో కాలుపెట్టిన తరువాత రెండు మూడు మామిడి తోపులు దాటిపోయినాయి. చెదురు మదురుగా వున్న చిన్న చిన్న దీపాల మిణుకు మిణుకు కాంతులతో తారట్లాడుతున్న పూరిళ్ళు వెనక్కు వెళ్ళిపోయినాయి. తరువాత పెంకుటిళ్ళ వరుస దాటిన తరువాత ఒక పెద్ద వీధి వచ్చింది. 'ఇదే జమిందారిగారి వీధి కాబోలు' అనుకున్నాడు.

నాలుగు రోడ్ల కూడలి వద్ద మాట్లాడుకుంటున్న వ్యక్తుల దగ్గరకు వెళ్ళి, "ఇక్కడ మధుమూర్తిగారి ఇల్లు ఎక్కడ?" అని అడిగాడు.

ఒక్క క్షణం మాట్లాడుకుంటున్న ఆ నలుగురూ నిశ్శబ్దంగా నిలబడిపోయి సారథిని

తేరిపార జూచారు.

వాళ్ళ నడవడికి సారథికి చికాకు వేసింది.

కొద్దిగా గొంతు హెచ్చించి, "మీకు మధుమూర్తిగారిల్లు తెలుసా?" అన్నాడు.

"మీరు వారికి బంధువులా?" అడిగాడు ఆ నలుగురిలో ఒక పెద్దాయన.

"కాదు... మిత్రుణ్ణి!"

ఒక్కక్షణం ఆగి, "మీరు ఇటు సరాసరి పైకి వెళ్ళండి. వీధి చివర రెండంతస్తుల పెద్ద మేడ కనిపిస్తుంది. ఇంటి ముందు పెద్ద గేటు. ఈ వరసలో అంత పెద్ద మేడ మరొకటి లేదు. మీరు ఇట్టే పసిగడతారు!" అన్నాడు ఇందాక ప్రశ్నించిన వ్యక్తే.

తిరిగి ఆ ప్రదేశాన్ని నిశ్శబ్దమావరించింది.

వారి వింత ప్రవర్తనకు ఆశ్చర్యపోతూ సారథి వడివడిగా ముందుకు అడుగులు వేశాడు. అతడి లోని ప్రతి నరమూ మధుమూర్తిని ఎప్పుడు చూద్దామా, అతడిని ఎప్పుడు హృదయానికి హత్తుకుందామా అని ఆతురత చెందుతున్నది.

దూరంనుండి ఆ రెండంతస్తుల పెద్ద మేడను చూసి ఆశ్చర్యపోయాడు సారథి. ఇదేనా ప్రియబంధు?... ఇంత నీరసంగా, నిర్జీవంగా, కాంతిహీనంగా ఉన్నదేం? ఇంత పెద్ద మేడలో ఇంకా దీపమైనా వెలిగించలేదా? మధుమూర్తి వాళ్ళు ఊళ్ళో లేరా? ఎక్కడకు వెళ్ళారు?

దబదబా బ్యాటరీలైటు వెలిగించి, దగ్గరికల్లావెళ్ళి గేటుమీది అక్షరాలు చూచాడు. 'అవును! ఇదే ప్రియబంధు!'

అతడు అయోమయంగా గేటు నెట్టుకొని లోపల వరండాలో కాలుపెట్టాడు. తిరిగి బ్యాటరీలైటు మూసి వున్న తలుపులమీదకు వేసి కొంత మనస్థిమితం జెందాడు. తలుపులు దగ్గరకు వేసి వున్నాయి!

ఆతురతతో ముందుకు నడిచి, "మధుమూర్తీ! మధుమూర్తీ!" అంటూ తలుపులు

నెట్టి, తెరుచుకున్న వాటిగుండా లోపలకు చూస్తూ నిశ్చేష్టుడై నిలబడిపోయాడు!

మధుమూర్తి రెండు చేతుల నడుమ వాడి నల్లబడిపోయిన ముఖాన్ని ఇరికించుకొని తనవంకే చూస్తున్నాడు. అతడి కళ్ళు తాగినవాడి కళ్ళలా ఎర్రగా మండిపోతున్నాయి. అతడి జుట్టు, ముఖమంతా చిందరవందరకా పడి అసహ్యంగా వున్నది. అతడి ఎదురుగా వున్న నూనేదీపపు కాంతి అక్కడి దృశ్యాన్ని మరింత భయానకంగా ప్రదర్శిస్తూంది!

"మధుమూర్తీ!" పెద్దగా పిచ్చివాడిలా అరిచాడు సారథి.

మధుమూర్తి ఉలిక్కిపడి లేచి నిలబడి, "సారథీ!... నువ్వా!" అన్నాడు.

"అవును, నేనే, నీ మిత్రుణ్ణి, సారథిని! ఏం జరిగింది? అలా ఉన్నావేం?" ప్రశ్నల వర్షం కురిపించాడు.

మధుమూర్తి ఆ ప్రశ్నలకు సోఫాలో కూలిపోయి ముఖాన్ని చేతుల్లో దాచుకొని వెక్కి వెక్కి ఏడుస్తూ, "శాంతి నన్ను ఈ ప్రపంచంలో ఒంటరివాడిని చేసి వెళ్ళిపోయింది, సారథీ!" అన్నాడు.

"మధుమూర్తీ! ఏమంటున్నావ్?"

సారథి తల తిరిగిపోయింది.

శాంతి మరణించింది!

అది ఊపిరి సల్పుకోలేని నగ్నసత్యం! పచ్చి నిజం!

* * *

మధుమూర్తిని ఎలా ఓదార్చాలో సారథికి అవగాహన కాలేదు.

ఎంతో సరదాగా, జీవితంలో మరువలేని మధురక్షణాలుగా గడుపుదామని వచ్చిన సారథికి ఆ సంఘటన విద్యుత్ఘాతంలా తగిలింది. అతడికంతా అయోమయమయిపోయింది.

'ఇదేంవిటి? ఇలా జరిగిందేం?' అని విస్తుపోయాడు.

అసలు మిత్రుడు మధుమూర్తిని ఓదార్చ వలసిన సారథి మూడు రోజుల వరకూ తేరుకోలేక పోయాడు. వాకిట్లో నిలబడి కళాహీనమైన 'ప్రియబంధు'ను చూస్తుంటే మనస్సు ఎవరో కెలికినట్లనిపించింది. ముందువున్న మందారాలు, మల్లెలు చెట్టునే వాడిపోయి తొడిమలకు వేలాడు తున్నాయి.

సాయం సమయపు చల్లనిగాలి మృదువైన నీటిజల్లులా జారిపోతూంది. ఆరుబయట గేటుకివతలగా పేముకుర్చీలో కూర్చున్న సారథి లేచి దాపునే వున్న మల్లె పొదవద్దకు నడిచి, చెట్టును వికృతపరుస్తున్న వాడిన మల్లెలను చేతులతో తీసి వేసి ఒకనిట్టూర్పు విడిచాడు. ఆ ఆవరణను చూస్తుంటే సారథికి నేత్రాలలో నీళ్ళు కదిలినాయి.

'నీరసంగా, నిర్జీవంగా మూడు రోజులు గడిచి పోయినాయి!' అనుకున్నాడు తిరిగి కుర్చీలో కూర్చుంటూ.

మధుమూర్తి వచ్చి సారథికి ఎదురుగా కూర్చున్నాడు.

చీకటి భూతంలాగా ఆవరించుకు వస్తూంది. నక్షత్రాలు క్షణక్షణానికి తేజస్సును నింపుకుంటున్నాయి. కాకులు బారులు తీరి గృహాలకు వెళ్ళే ఆత్రతుతో ఉరకలు వేస్తున్నాయి.

మధుమూర్తి నిశ్చలంగా సారథి ముఖంలోకి చూస్తూ కూర్చుండిపోయాడు. జీవనరంగంలో వెలుగు విన్యాసాల వింతవింత కాంతులతో విరాజిల్లుతున్న సమయంలో అశనిపాతంలా నల్లని అవనిక అడ్డుపడింది. రంగస్థలమంతా కారు చీకటి క్రమ్మింది. పాత్రధారుడు పరాజితుడై కూలిపోయాడు!

"సారథీ! అనుకున్న దొకటి, అయిన దొకటి. ఎన్నో కలలు గన్న శాంతి కోరికలు గగన కుసుమాలే అవ్వగా నన్ను ఒంటరివాడిని చేసి వెళ్ళిపోయింది. నేను చీకటి అగాథంలో తిరిగి వెలుగును పొందకుండా కూలిపోయాను!"

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Mithyabimbalu**

* * *